ఆర్‌బీకేలతో వ్యవసాయాభివృద్ధి

- రైతు ముంగిట సేవలతో గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు
- ప్రతి సచివాలయం పరిధిలో ఒక ఆర్‌బీకే
- నియోజకవర్గ పరిధిలో 70 ఆర్‌బీకేలు


ఉండిలో రైతులకు సేవలందిస్తున్న రైతు భరోసా కేంద్రం

ఉండి: రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తానని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్టే చేశారు. దానికోసం ప్రతి సచివాలయ పరిధిలో ఓ రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఓ అధికారిని ప్రత్యేకంగా ఆర్‌బీకేలో ఏర్పాటు చేశారు. దాని పరిధిలోని ఏఒక్క రైతు వ్యవసాయ విషయంలో ఆందోళన చెందకూడదనే ఉద్దేశంతో వ్యవసాయానికి సంబంధించిన అన్ని సేవలను ఆర్‌బీకే ద్వారా రైతులకు ప్రభుత్వం అందిస్తుంది. రైతు భరోసా కేంద్రాలు నారు పోసే సమయం నుంచి ధాన్యం అమ్మకం చేసే వరకు ప్రతి రైతుకు మద్దతుగా నిలుస్తున్నాయి. విపత్తులు వచ్చి నష్టపోతే వెంటనే నష్టపరిహారం అందించే ఏర్పాట్లు, అధిక వర్షాలతో నారు మునిగిపోయి పాడైపోతే వెంటనే ఉచితంగా విత్తనాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, అలాగే రైతు ముంగిటే తక్కువ ధరకు ఎరువులు, పురుగు మందులు ఇలా ఒకటేంటి అన్నింటా రైతును రాజును చేస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వ రైతు సేవలో నిమగ్నమైంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 70 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సేవలు అందుతున్నాయి.

రైతు భరోసా కేంద్రం ద్వారా అందించే సేవలు
విత్తనాలు రైతులకు ఆర్‌బీకెల ద్వారా నాణ్యమైన విత్తనాలను రైతులకు అందజేస్తారు. నారుపోసిన వేళ ప్రకృత్తి విపత్తులు సంభవిస్తే 80 శాతం సబ్సిడీతో రైతులకు విత్తనాలు అందిస్తారు.

రైతు భరోసా
రైతులకు పంటసాగు సమయంలో పెట్టుబడి నిధి కింద అర్హులైన రైతులు, కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా క్రింద నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో రూ.13,500 జమ చేస్తారు.

ఇన్‌పుట్ సబ్సిడీ
వరిపంట సాగులో ఉన్న సమయంలో ప్రకృతి వైపరిత్యాల వల్ల,అధిక వర్షాలు,గాలుల వల్ల పంట 33 శాతం నష్టం జరిగినప్పుడు ప్రభుత్వం ఎకరాకు రూ.6 వేలు నష్టపరిహారంగా రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు.

సున్నావడ్డీ
ఖరీఫ్ సమయంలో వరినాట్లు వేసే ముందుగా బ్యాంకుల ద్వారా రైతులకు, సీసీఆర్‌సీ కార్డుల ద్వారా కౌలు రైతులకు సున్నా వడ్డీకి ప్రభుత్వ రుణాలను అందజేస్తుంది.

వైఎస్సార్ ఫ్రీ క్రాప్ ఇన్సూరెన్స్
పంట నమోదు ప్రక్రియ ద్వారా పంట నమోదు చేసుకున్న రైతులకు ఉచిత ఇన్సూరెన్స్‌ను ప్రభుత్వం అందిస్తుంది. ప్రకృతి వైపరిత్యాల సమయంలో నష్టపోయిన పంటకు ఇన్సూరెన్స్‌ను ప్రభుత్వమే రైతుకు అందజేస్తుంది.

వైఎస్సార్ వ్యవసాయ యంత్ర సేవాకేంద్రం
ఈ పథకంలో సొంత పొలం కలిగిన ఐదుగురు రైతులు క గ్రూఫ్‌గా ఏర్పడితే వారికి 40 శాతం సబ్సిడీపై వ్యవయసాయ యంత్ర పరికరాలు (ట్రాక్టర్, వరి కోతమిషన్, క్రిషి ట్రాక్టర్, స్ప్రేయర్స్ తదితర యంత్రాలు) రైతులకు అందజేస్తారు.

వైఎస్సార్ పొలంబడి
వ్యవసాయ ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించేందుకు గ్రామంలో 25 మంది రైతులను ఎన్నుకోవడం వారికి సాగులో మెళకువలు నేర్పుతూ వారికి ఒక రోజు శిక్షణ ఇస్తారు. మంగళ, బుధ, గురు వారాల్లో ఈ శిక్షణా కార్యక్రమాలు ఆర్‌బీకే వద్ద నిర్వహిస్తారు.

పంట నమోదు (ఈ–క్రాప్)
రైతు భరోసా కేంద్రం ద్వారా ప్రభుత్వం అందించే సేవలు పొందాలంటే రైతు పంట నమోదు చేయించుకోవాలి. పంట నమోదు ప్రక్రియలో భాగంగా రైతులు తమ బయోమెట్రిక్, బ్యాంకు ఖాతా వివరాలు ఆర్‌బీకేలో అందించాల్సి ఉంటుంది.

ఎరువులు, పురుగు మందులు
గతంలో ఎరువులు, పురుగు మందుల కోసం రోజుల తరబడి ఆయా దుకాణాల ముందు లేదా సహకారం బ్యాంకుల దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు రైతు భరోసా కేంద్రాల వద్దనే అంటే ఇంటివద్దనే రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు మార్కెట్ ధరలకన్నా తక్కువ ధరకు అందిస్తారు. రైతులు బుక్ చేసుకున్న 48 గంటల వ్యవధిలోనే డోర్ డెలివరీ చేస్తారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం
గత ప్రభుత్వాలు ధాన్యం కొనుగోలు కేంద్రం అంటూ మండలానికి ఒకటి లేదా రెండు కేంద్రాలను ఏర్పాటు చేసే వారు కాని ఇప్పుడు అయితే సచివాలయ పరిధిలో ఉన్న ప్రతి రైతు భరోసా కేంద్రంలోను ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఆర్‌బీకేలతో భరోసా


రైతులకు పంట నష్టం జరిగిన సమయంలో గతంలో చాలా మంది రైతులు ఎలాంటి ప్రభుత్వ సాయం అందక తీవ్రంగ నష్టపోయేవారు. కానీ ఇప్పుడు అన్నింటికీ జవాబుదారితనం రావడం, అధికారి ప్రతిరోజూ కళ్ళముందే ఉండటంతో రైతు నిర్భయంగా వ్యవసాయం చేసుకుంటున్నాడు.
– నడింపల్లి రామకృష్ణంరాజు, రైతు, కోలమూరు.

ఆర్‌బీకేల ఏర్పాటుతో వ్యవసాయ పురోభివృద్ధి


సచివాలయ పరిధిలో రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో వ్యవసాయ అభివృద్ధి మరో మెట్టుపై నిలిచింది. రైతులకు వ్యవసాయ సేవలు ఆమడ దూరంలో ఉండగా ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి రైతు ముంగిటకే వ్యవసాయ సేవలు అందుబాటులోకి తెచ్చారు. దీంతో వ్యవసాయ విస్తీర్ణం పెరిగింది.
– కొండవేటీ సాంబశివరావు, రైతు, సర్పంచ్, చెరుకువాడ

వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు


గ్రామస్థాయిలో రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు,అధికారుల నియామకంతో వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. రైతులకు జవాబుదారీగా గ్రామంలో ఓ కార్యాలయం అగిన వెంటనే సమాధానం చెప్పేందుకు ఓ అధికారి ఉండటంతో రైతుకు పలు విషయాలపై అవగాహన వచ్చింది. విత్తనాలు, ఎరువులు ఇంటిముంగిటికే రావడంతో రైతుల కష్టాలు తీరిపోయాయి.
– తాటిపత్తి పెదవీరప్ప, మండల వ్యవసాయ సలహాసంఘ చైర్మన్, పాములపర్రు

క్లుప్తంగా

పొగాకు దుష్ప్రభావాలపై అవగాహన


పొగాకు దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): వరల్డ్ నో టొబాకో డే సందర్భంగా డాక్టర్ బీవీ రాజు ఫౌండేషన్ విష్ణు డెంటల్ కాలేజీ–హాస్పిటల్ ఆధ్వర్యంలో వివిధ ప్రజా అవగహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, భీమవరం వారితో కలిసి బుధవారం టొబాకో అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో ఉన్న పెషెంట్స్‌కి పొగాకు వలన కలిగే ఆరోగ్య సమస్యలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విష్ణు డెంటల్ కాలేజీ డాక్టర్ కేఎస్ చైతన్య రామ్, కె.హర్షిత, డాక్టర్ పి.యశస్వి, భీమవరం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ డాక్టర్ మాధవి కళ్యాణి, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.2 లక్షల విరాళం


దాత మోహన్‌రావుకు బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు వేర్వేరుగా బుధవారం రూ.2 లక్షలను విరాళంగా అందజేశారు. అందులో భాగంగా భీమవరం మండలం నరసయ్య అగ్రహారానికి చెందిన సోడిశెట్టి వీరవెంకట మోహన్‌రావు రూ.1,00,111 ఆలయ కార్యాలయంలో జమచేయగా, దాతకు దేవస్థానం ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు. అలాగే గన్నవరానికి చెందిన ఓ.మోహనరంగారావు రూ.లక్ష నిత్యాన్నదాన కార్యాలయంలో జమచేయగా, ఆలయ సూపరింటెండెంట్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందజేశారు. దాత కుటుంబాలకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

రావిపాడు ఘటనపై విచారణ చేయాలి


భీమవరంలో విలేకరులతో మాట్లాడుతున్న మంగరాజు

భీమవరం: పెంటపాడు మండలం రావి పాడు గ్రామంలో దళితులపై పోలీస్‌ల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. బుధవారం భీమవరంలో జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ, చెవ్వకుల భరత్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. 40 ఏళ్లుగా రావిపాడు గ్రామంలోని ఇరిగేషన్ భూమిలో అంబేడ్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించుకుంటుంటే అదే స్థలంలో కొంత మంది ఆక్రమించుకుని గడ్డివాములు వేసుకొని స్థలాన్ని కబ్జా చేసుకోవడమే గాక అదే గ్రామానికి చెందిన మిలటరీ వ్యక్తికి పట్టా ఇచ్చారంటూ ఇంటి నిర్మాణం చేపట్టగా విషయాన్ని పెంటపాడు తహసీల్దార్‌కు దళితులు విన్నవించుకున్నా ఎన్నికల కోడ్ పేరుతో జాప్యం చేయడం వల్ల వివాదం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. వివాదం పెద్దదికావడానికి కారణమైన తాడేపల్లిగూడెం రూరల్ సీఐ రమేష్‌ను సస్పెండ్ చేయాలని మంగరాజు డిమాండు చేశారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్, కమిషన్ సభ్యులు రావిపాడు గ్రామాన్ని సందర్శించి అక్కడ దళితులకు న్యాయం చేయాలని కోరారు.

స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్‌లో జాబ్ అచీవర్స్‌డే

నరసాపురం రూరల్: మండలంలోని సీతారామపురం స్వర్ణాంధ్ర పాలిటెక్నికల్ కళాశాలలో బుధవారం అచీవర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర కళాశాల చైర్మన్ కె.సత్యనారాయణమాట్లాడుతూ అతి పిన్న వయస్సులోనే ఉద్యోగం చేయగల సాంకేతిక నైపుణ్యం కేవలం పాలిటెక్నిక్ విద్యతోనే సాధ్యమని అన్నారు. 2024 ఫిబ్రవరి నుంచి కళాశాలలో నిర్వహించిన వివిధ క్యాంపస్ ఇంటర్వ్యూలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 97 మంది విద్యార్థులకు ఉద్యోగాలు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి డీసీఎంఈ బ్రాంచ్‌కు 270 సీట్లకు పెంచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగావకాశాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. తొలుత ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు ఆయా కంపెనీల ప్రతినిధులు ఆఫర్ లెటర్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోశాధికారి కేవీ స్వామి, పాలకవర్గ సభ్యుడు అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్స్ డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ సేవలో మోషేన్‌రాజు


ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

భీమవరం అర్బన్: మండలంలోని దెయ్యాలతిప్ప గ్రామంలోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా బుధవారం రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, నరసాపురం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల దర్శనం చేసుకున్నారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఉండి సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

ఉపాధి పనుల బకాయిలు ఇప్పించాలి

ఉండి: మండలంలోని వివిధ గ్రామాల్లో 2023–24 ఏడాదికి గాను బకాయిపడ్డ ఉపాధి హామీ కూలీ పనులను ఇప్పించాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఉండి మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉండిలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ 2022లో ఇద్దరు కూలీలకు మూడు వారాల చొప్పున బకాయిలు ఉన్నాయని వాటిని కూడా వెంటనే ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే వివిధ డిమాండ్లను పరిష్కరించాలని ఎంపీడీఓను కోరారు. వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్రా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వర రావు, జిల్లా అధ్యక్షుడు కలిశెట్టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవ ప్రతి ఒక్కరి బాధ్యత


రంగరాజుకు ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న లయన్స్‌క్లబ్ గవర్నర్ మాణిక్యాలరావు

ఉండి: సమాజ సేవను ప్రతీ ఒక్కరూ బాధ్యతగా భావించాలని లయన్స్‌క్లబ్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. మంగళవారం రాత్రి ఉండి లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో గవర్నర్ అధికారికంగా పర్యటించారు. ఈ సందర్భంగా క్లబ్ చేపట్టిన సేవలను ఆయన కొనియాడారు. మరిన్ని కార్యక్రమాలు చేపట్టి సమాజానికి లయన్స్‌క్లబ్ తరపున సేవలు అందించాలని సూచించారు.ఈ సందర్భంగా క్లబ్ ఉపాధ్యక్షుడు గాదిరాజు రంగరాజును ప్రత్యేకంగా సత్కారించారు.ఈ సందర్భంగా సాగిరాజు సాంబరాజు ఆర్థిక సహాయంతో పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు, విద్యార్థులకు విద్యాసామగ్రి, భవిత విద్యార్థులకు టిఫిన్ బాక్స్‌లు, చెరుకువాడ పెదపేట విద్యార్థులకు స్టీలు కంచాలు గవర్నర్ చేతుల మీదుగా అందించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 12 మంది విద్యార్థులు ఎంపిక

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బీఆర్‌ఆర్ అండ్ జీకేఆర్ చాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బుధవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 12 మంది చాంబర్స్ విద్యార్థులు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కళాశాలలో సినర్జీస్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 57 మంది విద్యార్థులు హాజరవ్వగా 12 మంది ఎంపికయ్యారన్నారు. ఇంటర్వ్యూల్లో ఎంపికైన విద్యార్థులకు రూ. 20 వేలు వేతనం ఉంటుందన్నారు. విద్యార్థులను రాతపరీక్ష, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహరావు అభినందించి ఆఫర్ లెటర్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ కలిదిండి రామరాజు, కంపెనీ సిఈవో నల్ల దినేష్, హెచ్‌ఆర్ నవ మణికంఠ, కళాశాల ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జ్ కె.లక్ష్మణ రావు, ట్రైనర్ కె.సంతోష్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికల ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ


యండగండిలో అవగాహన కల్పిస్తున్న వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది


కాళ్లలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: కిశోర బాలికల ఎదుగుదలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యాధికారులు, అంగన్‌వాడీ వర్కర్లు బాలికలకు యండగండి, ఉణుదుర్రు, చెరుకువాడ, ఉండి తదితర గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిశోర బాలికలు వారి శరీరంలో కలిగే మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ తల్లి వారికి ప్రత్యేక సలహాలు ఇవ్వాలన్నారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రతపైనా వారికి కొన్ని సూచనలు చేయాలన్నారు. పౌష్టికాహారాన్ని వారికి సక్రమంగా అందిస్తేనే వారి భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎదుగుతారని అన్నారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు నిర్మల, పి.మేరీ, ఏఎ‌స్ఎం రామలక్ష్మీ, సీహెచ్ సంద్యారాణి, కార్యకర్తలు చిట్టి మరియ, సుజాత, సుబ్బలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కాళ్లలో...
కాళ్ల: రుతుక్రమం సమయంలో పరిశుభ్రత పాటించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యకుమారి తెలిపారు. కాళ్ల మండలంలో బుధవారం పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో రుతుక్రమంలో పరిశుభ్రత పాటించాలని అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో కాళ్ల పెదఅమిరం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో కిషోర బాలికలకు తల్లులకు అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.

పెంటపాడు వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతిబాబు

భీమవరం: పెంటపాడు మండలం రావిపాడు గ్రామంలో దళిత పేటలో స్థల వివాదం అధికారుల జాప్యమే కారణమని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె క్రాంతిబాబు ఆరోపించారు. బుధవారం భీమవరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్ చిన్న నాగేశ్వరరావుతో కలిసి మాట్లాడారు. రావిపాడు గ్రామంలో దళిత పేటకు ఆనుకొని ఉన్న ఇరిగేషన్ భూమిని సుమారు 40 ఏళ్లుగా దళితులు ఉపయోగించుకుంటున్నారని దీనికి అంబేడ్కర్ యూత్ సొంత ఖర్చులతో స్థలాన్ని అభివృద్ధి చేసుకున్నారన్నారు. ఆ స్థలంలో అదే గ్రామానికి చెందిన సైనిక అధికారికి 3 సెంట్లు ఇంటి స్థలం కేటాయించడంతో ఇల్లు నిర్మించడం వలన వివాదం తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ వివాదాన్ని ఎన్నికల కోడ్ పేరుతో అధికారులు అలసత్వం వహించడం వల్లనే వివాదం ముదిరిందని క్రాంతిబాబు ఆరోపించారు. సైనిక కుటుంబానికి అధికారులు న్యాయం చేయాలని, స్థలం కేటాయించి ప్రభుత్వమే ఇంటి నిర్మాణం చేసి ఇవ్వాలని, దళితులు అభివృద్ధి చేసుకొని ఉపయోగించుకుంటున్న ఆ స్థలాన్ని దళితులు యధావిధిగా వాడుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరారు.

పంట కాలువలు, డ్రెయిన్లను ఆధునికీకరించాలి


భీమవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

భీమవరం: సాగునీటి కాలువలు, మురుగు నీటి డ్రెయిన్స్‌ను గడిచిన 15 ఏళ్లుగా ఆధునికరించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. బుధవారం భీమవరం పట్టణంలో జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నర్సింహమూర్తి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో సంఘం నాయకుడు వై.కేశవరావు మాట్లాడుతూ త్వరలో నూతనంగా బాధ్యతలు చేపట్టే ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటు, జిల్లాలో ఉన్న సాగునీటి కాలువలు, మురుగు కాలువలు ప్రక్షాళనకు తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అక్విడెట్లు, లాకుల తలుపులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద సబ్సిడీపై విత్తనాలు అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు జమచేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో యాతం రాంబాబు, కిలారి తవిటినాయుడు, చీర్ల పుల్లారెడ్డి, గండికోట వెంకటేశ్వరావు, కర్రా సోమిరెడ్డి, వీరవల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి


ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లతో మాట్లాడుతున్న ఏడీఏ ఈదా అనిల్‌కుమారి

యలమంచిలి: సార్వా పంటకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని రైతు భరోసా కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు ఏడీఏ ఈదా అనిల్‌కుమారి సూచించారు. మండలంలోని మేడపాడు రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం రైతు భరోసా కేంద్రాల ఇన్‌చార్జ్‌లతో నిర్వహించిన సమావేశంలో ఏడీఏ మాట్లాడారు. రైతులతో చర్చించి అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుకునే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల వద్ద పచ్చి రొట్ట పైర్లు పిల్లిపెసర, జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సీహెచ్ దేవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు


గ్రంథాలయ వేసవి శిక్షణ డ్యాన్స్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


భీమవరం శాఖా గ్రంథాలయంలో పుస్తపఠనంలో నిమగ్నమైన విద్యార్థులు

ఉండి: యండగండి శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం నిర్వహించిన డ్యాన్స్‌పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో వివిధ స్కూల్స్ నుంచి సుమారు 40 మంది విద్యార్థులు పాల్గొని ఉల్లాసంగా డ్యాన్సులు చేశారు. బైర్రాజు ఫౌండేషన్ ద్వారా మూడు రోజుల పాటు విద్యార్థులు అందించిన శిక్షణా కార్యక్రమం విద్యార్థులకు చాలాబాగా ఉపయోపడిందని గ్రంథాలయ అధికారి ఎన్‌సీహెచ్ రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో కో–ఆపరేటివ్ బ్యాంక్ కార్యదర్శి సీహెచ్ రవికుమార్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేగేశ్న సత్యరాజ్, బైర్రాజు ఫౌండేషన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో...
భీమవరం: పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఎస్జీటీ టీచర్ జి.గంగాధర్ విద్యార్థులకు సంఖ్యలతో ఆటలు, కోణాలతో అంకెల నిర్మాణం, అంకెల చరిత్ర భారతీయులు సున్నాను కనుగొన్న విధానం వివరించారు. అనంతరం వివిధ నీతి కథలను వివరించారు. గ్రంథాలయాధికారి ఎస్ వెంకటేశ్వరరావు పుస్తక పఠనం, చెస్, క్యారమ్స్ క్రీడలను పర్యవేక్షించారు. నృత్య కళాకారుడు జె.శ్యామ్ విద్యార్థులకు నృత్యంలో శిక్షణ ఇచ్చారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు


వీరవాసరం మండలంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న దృశ్యం


పంట బోదె తవ్వుతున్న ఉపాధి హామీ కూలీలు

వీరవాసరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు వీరవాసరం మండలం వ్యాప్తంగా ముమ్మరంగా సాగుతున్నాయి. దాళ్వా సీజన్ పూర్తి కావడంతో వ్యవసాయ సంబంధిత పనులు ఏమి లేకపోయేసరికి ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనులు వేగంగా సాగుతున్నాయి. వీరవాసరం మండలంలోని 23 గ్రామపంచాయతీ పరిధిలోని పంట కాలువలు పంట బోదెలు మంచినీటి చెరువుల ప్రక్షాళన తదితర పనులను పెద్ద ఎత్తున చేపడుతున్నారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశంలో తాగునీరు టెంట్లు అందుబాటులో ఉంచి పనులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 గంటలు మొదలుకొని 10:30 వరకు 11 గంటల వరకు తదుపరి సాయంత్రం ఎండ తీవ్రత తగ్గిన తరువాత పళ్ళను తపదపాలుగా నిర్వహిస్తున్నారు పని ప్రదేశంలో వేతనదారులకు త్రాగునీరు ప్రధమ చికిత్స ఓఆర్ఎస్ ప్యాకెట్లు నీడ కోసం టెంట్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. టెక్నికల్ ఫీల్డ్ అసిస్టెంట్ల ఇచ్చిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేస్తే రోజుకు ఒక వేతనదారుడికి రూ.300 వస్తుందని ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఉపాధి హామీ కూలీలకు రోజుకు 250 నుంచి 280 లభిస్తుందని పేర్కొంటున్నారు. మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో ఇప్పటివరకు 422 మంది కూలీలకు 71 428 పని దినాలు కల్పించడంతోపాటు సుమారు రూ.1.30 కోట్లు వారి వారి ఖాతాలకు జమ చేశామని అధికారులు పేర్కొంటున్నారు.